
# ఏటికి నీళ్ళొత్తగిలాయి



ఏరు ముందా? యేరోపొర్ణం ముందా? అను కుంటూ నిలబడ్డాడు రాజయ్య. నిన్న మంటలు జిమ్మిన సూరీడు మళ్ళీ రాబోతున్నాడు. సముద్రపు గాలికి ఇంటి ముందున్న వేప చెట్టు తల ఆడిస్తోంది.

రాజయ్య గూడెంలో పెత్తందారు. మాటా మంచీ వున్న మనిషి. అంటరానివాడిగా అగ్రవర్ణాలవారు 'రాజీగా' అని పిలిస్తే ఆ పిలుపులో వున్న దోషం అతనికి తెలియదు. అలవాటైపోయిన ఆ పిలుపును కాదని ఎవరైనా 'రాజయ్యా!' అంటే ఏదో ప్రమాదం వచ్చి పట్టుంటుంది.

ఎదురుగా కృష్ణానదిలో సన్న జాలు వంకరలు తిరిగి నడుస్తోంది, వయ్యారాలుపోతూ నడుస్తోంది, ఉరకలేస్తూ నడుస్తోంది.

చిన్నపిల్లలు పాకుతున్నట్టు కదులుతోంది. రాజయ్య నది వంక మాసి తనలో తాను నవ్వుకున్నాడు. వేప మండ విరిచి ఆకులూ, ఈనెలూ తీసివేశాడు. ముఖం పుల్ల నోట్లో పెట్టుకుని, నములుతూ నది వంకే మాస్తున్నాడు.

"ఇయ్యేడు యేరే ముందొచ్చేత్తుందనుకుంటూ" నంటూ రాజయ్య భార్య రమణమ్మ మొగుడి పక్క కొచ్చి నిలబడింది.

రాజయ్య మాట్లాడలేదు. నదివంకే మాస్తూ నిలుచున్నాడు.

ఎన్ని రోజులు ఎన్ని గంటలు ఆ నదిని అలా మాస్తూ నిలుచున్నా అతనికి విసుగనిపించదు.

ఆ ఇసుకా, ఆ బుసకా, ఆ లంకా, అటువైపు దూరంగా కనిపించే శ్రీకాకుళం, ఆ పైన స్వామివారి గాలి గోపురం అతని కంటికి ఇంపుగా వుంటాయి. మనసుకు మంచిగా వుంటాయి.

ఆ నది ఏ రూపంలో వున్నా అతనికి ఆనందంగానే వుంటుంది.

రమణమ్మ మొగుడి చేయి కదిలించి, "ఎప్పుడు మాచినా అట్లా ఆ నదివంక మాస్తావు. అక్కడ నీకేం కనిపిస్తుంది?" అని అడిగింది.

రాజయ్య భార్యవైపు మాడకుండా "చెప్పినా నీకు తెలవదులే" అన్నాడు.

ఆ సమాధానానికి ఆమెకు కోపం వచ్చింది. "తెలవక పోతే నా బతుకే తెల్లారకుండా కూహోదులే. నువ్వట్టాగే మాత్తామంచో. పని పాటా ఏమీ చేయొద్దు" అంది.

అతను వినిపించుకోకుండా దూరంగా నడచివెడు తున్న మనుషుల వంక మాస్తున్నాడు. వాళ్ళ చేతుల్లో మూడు రంగుల జెండాలున్నాయి. వాళ్ళంతా శ్రీకాకుళం వైపు వెళ్తున్నారు.

రమణమ్మ భర్త ముందుకొచ్చి నిలబడింది. ఆమెకు బాగా కోపంగా వుంది. "ఏమయ్యో! నే చెప్పేది వింటావా"?

అతను ఒక మాటు పెళ్ళాం వైపు మాసి, మాట్లాడకుండా వూరుకున్నాడు.

"కంచంలోకి నాలుగు మెతుకులు రావాలంటే చేతు లాడించాలి, చేతులు" అంది. ఆ మాటకు రాజయ్యకు కోపం వచ్చింది. "ఆపి యదవ ముండా! పొద్దున్నే మొదలెట్టావ్ గొనుగుడు" అని కసురుకున్నాడు.

రమణమ్మ వెనకాడలేదు. ఆమె కూడా బిగ్గరగానే అంది.

'అలా నోరు పారేసుకోకపోతే, ఈ పాకెంక మాడు. ఐనా, ఓ కానదిలో నీళ్ళు కనిపిస్తే, ఒళ్ళు తెలవదు.'

ఆ మాటలు విని రాజయ్య నవ్వుకున్నాడు. ఆ నవ్వు పెదవులు దాటి బయటకు రాలేదు. పళ్ళు తోము కుంటూ, "అసలు సంగతి చెప్పు" అన్నాడు.

రమణమ్మ రాగాలు తీస్తూ చెప్పింది.

"మొన్న సుడిగాలొచ్చిందా?"

"వచ్చింది."

"పాక మీద కప్పేసి మూడేళ్ళయిందా?"

"అయింది."

"గాలికి కప్పు కదిలిపోయిందా?"

"పోయింది."

"తొలకరి చినుకులు పడబోతున్నాయా?"

"ఐతే ఏమంటావే?" అతను చిరాకుపడుతూ అడిగాడు.

"తెలవదేమిటి? నీ కంతా యటకారమే" అంది.

రాజయ్య అప్పుడు పకపకా నవ్వాడు.

ఆ నవ్వు మాసి రమణమ్మ మురిసిపోయింది. పైకి కనపడకుండా "నీకు నా మాటంటేనే యటకారం" అంది.

"దొరగారి నడిగాను. తాటాకులు కోయించి, మడం తొక్కించాడు. వాటిలో కావాల్సినవి తీసుకు వెళ్ళమన్నాడు."

"ఆ పని తొరగా చేసేయ్" అంది.

రాజయ్య మట్టి బానలోని నీళ్ళ ముంతలో తెచ్చుకుని ముఖం కడుక్కున్నాడు. కట్టుపంచె కుచ్చీ చెంగుతో ముఖం తుడుచుకున్నాడు. ఏటివంక మాస్తూ నిల బడ్డాడు. కరకరమని పొద్దుపొడుస్తోంది. ఏటిలంక మీదుగా, చెట్ల కొమ్మల కిందుగా సూరేదు పరుగెత్తు కొస్తున్నాడు. కళ్ళు జిగేలుమంటూ కిరణాలు విసురు తున్నాడు.

రమణమ్మ కోళ్ళగంప లేపింది. అవన్నీ బయటికి పరుగులు తీశాయి. మెడలు నిక్కించి, ఒళ్ళ విరుసు కున్నాయి. ముక్కులతో ఈకలు కదలించి, పే ఐను ఏరుకున్నాయి.

పెద్ద పుంజు పెట్టల వెంట పరుగెత్తుతూ డొంకలోకి దూకింది. పెట్ట పరుగెత్తి పరుగెత్తి దొరికిపోయింది. శివ్వాళైనా ఇది గుడ్డెడితే బాగుండు. అల్లుడికి కంచంలోకి ఏమీ లేదు అనుకుంది రమణమ్మ.

రాజయ్య సూరేదు కిరణాల వంక మాచాడు. అవి కృష్ణమ్మ పాదాల మీద వాలి భక్తితో కొలుస్తున్నట్టు న్నాయి. 'అందుకే కాబోలు సరిగా నిద్దరోకుండా తొందరగా సూరేడొచ్చాడు. వస్తూనే తీర్థం తీసుకోను నీటి మీద వాల్తున్నాడు. అందరికీ కిట్టమ్మంటే పేమే' అనుకున్నాడు రాజయ్య.

ఆ కాకుళయ్య గుడిలోని అయ్యవారికి మల్లే ముక్కుట్టుకు మునగటానికి సూరే డొస్తున్నాడేమో!

ఈ ఆలోచన రావడంతోటే రాజయ్య ఫక్కున నవ్వాడు!

రమణమ్మ మొగుడి వంక మాసింది. అరవైయేళ్ళు నిండినా అందరికిమల్లే ఈయనకు బొజ్జ రాలేదను కుంది. తనను మనువాడిన తొలి రోజుల్లో సరసా లాడుతూ అన్న మాటలు గుర్తుకొచ్చాయి.

"వసే! రమణా! రెండేళ్ళయ్యేసరికి నువ్వు మా యజమానిగారి దొడ్లోని రుబ్బురోలు మాదిరిగా అయి పోతావే. నేను మాత్రం సురిటీగా ముల్లుకర్రల్లే వుంటా!"

రమణమ్మ మూతి తిప్పింది. ఈ చెవి నుంచి ఆ చెవి వరకు మూతి వంకరలు పోయింది. "వాల్లేవయ్యా! బడాయి. తొందరెందుకూ? ఎవరు ఒళ్ళు చేస్తారో మాద్దాం" అంది.

రాజయ్యకు ఆ మాటకు కోపం రాలేదు. పెళ్ళాం మూతివంక మాశాడు. కదులుతున్న పెదాల వంక మాశాడు.

కొత్తగా కట్టిన తాళిబొట్టు వంక మాశాడు.

పసుపుతాడు కిందుగా బిగుతుగా వున్న జాకెట్టు వంక మాశాడు.

ఇంకొంచెం పక్కకు, కిందకూ జరిగిన మాపు

లతో ఆమె వయసుకు మించిన పొలిండ్ల వంక చూశాడు.

ఆ చూపు రమణమ్మకు అర్థమయింది.

ఆ కొంటె నవ్వు రమణమ్మకు చిరుకోపం పుట్టించింది.

ఆమె సిగ్గుపడుతూనే "నీ బుద్దేం బుద్దో పాడుబుద్ధి. ఎప్పుడూ యిదవాలోచన్లు" అంటూ చెంగు సరిచేసుకుంది.

రాజయ్య

పెళ్ళాం వంక చూశాడు. ఆమె ఎటో చూస్తోంది.

"ఏంటి చూత్తున్నావ్?" రాజయ్య అడిగాడు.

"ఏటికి నీళ్ళు తగిలినట్టున్నాయ్."

వెనక వైపుగా తప్పటడుగులు వేస్తూ మనుమడు వచ్చి తాత కాలు పట్టుకుని నిలబడ్డాడు.

రాజయ్య వాడిని ఎత్తుకున్నాడు. రమణమ్మ మనుమడి బుగ్గలను నవరించి, పని చేసుకోను వెళ్ళింది.

మనుమడు తాత గడ్డం మీద చేయి వేసి పెరిగిన వెంట్రుకలతో ఆడుకుంటున్నాడు. మీసాలు పట్టుకుని లాగుతున్నాడు.

రాజయ్య వాడి చిన్న చేతుల మీద ముద్దులు గుమ్మరించాడు.

రాజయ్య చెప్పులు లేని కాళ్ళతో నీళ్ళ వైపు బయలుదేరాడు.

"పీడి జిమ్మడ, ఈ డెప్పుడూ ఇంతే. ఏ రొత్తుందంటే సంబరం. ఏరు పొంగిందంటే సంబరం. వడ్డిరిగిందంటే సంబరం. లంక తేలిందంటే సంబరం. ఏం మనిషో! ఏంటో!"అనుకుంది.

రాజయ్య నీళ్ళ దగ్గర కొచ్చాడు.

వేసవిలో సన్నబడి చక్కగా నడిచే నదిలో ఏదో మార్పు వచ్చింది. తన మనుమడు పాకుతున్నట్టు ఆ నీళ్ళు అంచులకు పాకుతున్నాయ్. పసిబిడ్డ తప్పటడుగుల్లా అలలు అటూ, ఇటూ ఊగుతున్నాయ్. నీటి వాసనలో ఏదో మార్పు వచ్చింది.

ఇసుకలో తడి అంచులు దాటి పైకి పెరుగుతోంది.

చిన్న చిన్న పుల్లలూ, ఆకులూ కొట్టుకొస్తున్నాయి.

తెప్పలుగా తేలి వాలుకుపోతున్నాయి.

నురుగులు కక్కుతూ నది నడచిపోతోంది.

చంద్రుడు నీళ్ళతో వయ్యారాలు పోతుంది.

ఎదురొడ్డిన వృక్షాలను పెకలించి వేస్తుంది.

వాన చినుకులతో సరసాలాడుతుంది.

కన్నె వయసులో బుసలు పెడుతుంది.

నడిమి వయసులో తేటపడుతుంది.

ముదిమి వచ్చినపుడు మునగదీసుకుంటుంది.

ఎన్నో అందాలను నింపుకుంటుంది.

ఎన్నో సంబరాలను సలుపుకుంటుంది.

రాజయ్య తలలో ఎన్నో ఆలోచనలు.

తనకు అరవైయేళ్ళు నిండబోతున్నాయి. ఆమె ప్రతి సంవత్సరం నందేళ్ళ బతుకు బతుకుతుంది. సజీవంగా వుండి మరో సంవత్సరం కొత్త జీవితం ప్రారంభిస్తుంది.

అందుకే ఏరోపొర్లంతో పోటీ పడుతుంది.




— పోలవరపు కోటేశ్వరరావు

శ్రీకాకుళం తిరణాలకు వెళ్ళాలని రాత్రి పొద్దుపోయి వచ్చిన కూతురూ, అల్లుడూ ఇంకా లేవనే లేదు. మనమడు మాత్రం ముందే లేచాడు.

రాజయ్య సంతానమంతా ఇరగడైపోయారు. మొగుడూ పెళ్ళాం మాత్రం పాత ఇంటి పట్టునే నిట్టాడి పాకలో వుంటున్నారు. కూలి చేసుకుని కలో గంజో తాగి గౌరవంగా బతుకుతున్నారు.

మనుమడిని వదలి రాజయ్య బయలుదేరాడు.

రమణమ్మ వెనక నుంచి అడిగింది —"ఎక్కడికి పొద్దున్నే బయలుదేరావ్?"

"ఏటికాడికి."

"అక్కడి కెందుకూ?"

"పనుంది."

"ఆ! పని వుంటూనే వుంటుంది. నీళ్ళంటే పడి సత్తావ్."

రాజయ్య మాటాడలేదు.

"నువ్వెళ్ళకపోతే ఆ వచ్చే యేరు ఆగిపోదులే. ఇల్లు కప్పే సంగతి చూడు."

రాజయ్య ఎగువకూ, వాలుకూ చూశాడు. తన తల్లి ముసలితనంలో వంగిన నడుంతో నడచినట్టుగా పైన వంపులో నది మెల్లగా సాగుతోంది.

కోటేరు చాలులా మరో వైపు నుంచి కొత్త జాలు వచ్చి కలుస్తోంది. అక్కడే నిలచిన అతని పాదాల కింద చెమ్మ తగిలింది. తన మనుమడు పక్క తడి చేసినట్టుగా ఆ కాస్త చోటూ తడిసిపోయింది.

నది వస్తోంది.

అతని మనసు పొంగిపోయింది. అతని ఆలోచనలు పరుగులు తీశాయి.

తనలో తాను అనుకున్నాడు — కిట్టమ్మ వస్తోంది.

ఆగకుండా ప్రతి సంవత్సరం వస్తుంది.

ప్రతుళ్ళిపడుతూ నడుస్తుంది.

తొందర చేస్తూ నడుస్తుంది.

లంకలను ముంచి తేలుస్తుంది.

వడ్డులను ఒరిసి నడుస్తుంది.

మురికినీళ్ళతో ముచ్చటలు పోతుంది.

రాజయ్య పాదాల దగ్గరకు నీళ్ళు వచ్చాయి. దగ్గరలో చేప పిల్లలు ఈతలు కొడుతున్నాయి.

తాను చాకిరీ చేస్తున్నట్టు కృష్ణమ్మ కష్టపడుతుంది. ఈ జనం కొరకు తానూ కమతం చేస్తుందేమో!

ఈ ఊహ రావడంతోటే అతని మనసు కరిగిపోయింది. 'కావలసినంత సంపదను కూర్చే మా తల్లీ! మా లచ్చిమి!' అనుకున్నాడు.

భక్తితో ఆమె వంక చూశాడు.

పొడిచి బారెడు పాకిన సూరేదువంక చూశాడు.

వంగి నీళ్ళు తీసుకుని, నెత్తి మీద చల్లుకున్నాడు.

రెండు చేతులూ కలిపి నమస్కరించాడు.

దూరంగా ఒడ్డు మీద మనమడిని చంకను వేసుకుని రమణమ్మ నిలబడి చూస్తోంది. భర్త వంక చూపిస్తూ "మీ తాతను చూడరా! నీ మీద కన్నా ఆ నీళ్ళ మీదే ప్రేమ" అంది.

ఆ పసివాడు రెండు చేతులూ టపటప కొడుతూ బోసినవ్వు నవ్వాడు.